ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 19 ఫిబ్రవరి 2024 | 5



ఇంటర్ ప్రాక్టికల్స్‌కి 89 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టి కల్ పరీక్షలకు జిల్లాలో ఆదివారం 3,121 మంది హాజరుకాగా 89 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్‌ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం కలిపి 85 సెంటర్లలో పరీక్షలు నిర్వహించామన్నారు. అన్ని సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలకు హాజరుకావాలన్నారు.

ఇసుక తోడేళ్లు!

గోదారంతా ఇసుక డ్రెడ్జింగ్



దోపిడీ సాగుతుందిలా : గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్ పడవ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18 : గోదారంతా తవ్వేయ్.. అందినకాడకు దోచెయ్.. అన్న చందాన జిల్లాలో అక్రమ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.రాజమహేంద్రవరం అర్బన్‌లో కోటిలింగాలు 1,3,4 ర్యాంప్‌లు, రూరల్ పరిధిలో కాతేరు 1 నుంచి 10 వరకు, గాయత్రిలో ఆరు ఇసుక ర్యాంప్‌లు ఉన్నాయి. కోటిలింగాలు -1 మినహా మిగిలిన ర్యాంప్‌లలో గోదావరిని డ్రెడ్జర్లతో దొలిచేస్తున్నారు. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడేస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారానికి తెగబడుతున్నారు. కంచే చేను మేస్తే అన్న చందాన అధికార పార్టీ నాయకులే ఇసుక వ్యాపారంలో పాత్రదారులు..సూత్రదారులు కావడంతో అధికారులు ఏం చేయలేకపోతున్నారు. అయితే శనివారం కలెక్టర్ మాధవీలత ఇసుక అక్రమాలపై నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు.ఈ టీమ్ ఎంత వరకూ అక్రమాలను నియంత్రిస్తుందో వేచి చూడాల్సిందే..

నిబంధనలు తుంగలో తొక్కి..

ప్రభుత్వ పెద్దలతో నేరుగా సంబంధాలు ఉన్న నాయకులే ఈ అక్రమ వ్యాపారం చేయడం పరిపాటిగా మారింది. అక్రమంగా వచ్చిన కోట్లాది రూపాయల నగదు పెద్ద ఎత్తున చేతులు మారుతోంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అథారిటీ (ఎన్‌జీటీ) నిబంధలనకు విరుద్ధంగా ఇసుక ర్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. గోదావరిలో ఇసుకతీత కేవలం కార్మికులే చేయాలి. నావలో నది మధ్యకు వెళ్లి ఇసుకను తోడి ఒడ్డుకు తెచ్చి రేవులో గుట్టగా వేయాలి. దానిని కార్మికులు లారీలలో లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ వల్ల వందలాది మందికి పని దొరుకుతుంది.పర్యావరణ పరిరక్షణ జరుగుతుంది. కానీ ఒక్క ర్యాంపులో కూడా ఆ నిబంధనలు పాటించడంలేదు. ఎన్‌టీజీ నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జర్లతో గోదావరిలో ఇసుకను తోడేళ్ళ మాదిరిగా తోడేస్తున్నారు. దీని వల్ల నదీ గర్భంలో పెద్దపెద్ద అగాధాలు ఏర్పడుతున్నాయి. కాతేరు,గాయత్రి, కోటీలింగాలు రేవులలో రాత్రి 7 గంటల నుంచి డ్రెడ్జింగ్ ఆరంభిస్తున్నారు.రాత్రంతా ఇసుక తోడేస్తున్నారు. 10 యూనిట్లు, 16 యూనిట్లు, 20 యూనిట్లు, భారీ డ్రెడ్జింగ్ పడవలు ఉపయోగిస్తున్నారు.పైప్ డ్రెడ్జర్లు నదిలో పెట్టుకుని చిన్న చిన్న పడవలతో వచ్చి ఇసుక తోడేస్తున్నారు.ఒక పక్క వంతెనలకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వ కూడదని నిబంధన లున్నా లెక్క చేయడంలేదు. అంతా మా ఇష్టం అంటున్నారు. నిఘా శాఖలు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో ఇష్టారాజ్యంగా అక్రమ వ్యాపారం సాగుతుంది. సాధారణంగా ప్రతిరోజు ఎస్‌ఈబీ తనిఖీలు ఉండేవి..అవీ లేవు. వారు మొత్తానికే పట్టించుకోవడంలేదు. ర్యాంప్‌ల నిర్వాహకులను అడ్డుకునే పరిస్థితులు లేవు. రోడ్లపై లారీల బిల్లులను తనిఖీలు చేసేవారు ఇప్పుడు అటువంటివేమికానరావడంలేదు. ఇసుక లారీపై క్లాత్ కట్టకపోయినా ఫైన్ వేసేవారు లేరు. పూర్తిగా అధికారులంతా ఇసుక ర్యాంప్‌లు నిర్వహించే సంస్థలకు సరెండర్ కావడం విస్మయానికి గురిచేస్తుంది .

- యథేచ్ఛగా సా..గుతున్న దోపిడీ
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- నిబంధనలకు నీళ్లొదిలేశారు..
- మామూళ్ల మత్తులో అధికారులు
- ర్యాంపుల వైపు కన్నెత్తి చూడని వైనం
- సొసైటీలకు మిగిలిందేంలేదు
- ఆర్‌కేదే అధికారమంతా?

దోపిడీ సాగుతుందిలా..

గతంలో జేపీ సంస్థ ఆదీనంలో ఇసుక వ్యాపారం చేసేవా రు. అటుపై ర్యాంపులన్నీ ఆర్‌కే ఆదీనంలోకి వచ్చాయి. ప్రభు త్వ పెద్దల బ్యాగ్ బోనుగా ఆర్‌కే పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నారు. సాధారణ ఇసుక నావలో తీసుకు వస్తే యూనిట్ (4.5 టన్నులు) రూ.450 నుంచి రూ.500 వరకు బోటు యజమానికి ధరలు సొసైటీ చెల్లించేది. కానీ డ్రెడ్జింగ్ ఆరంభించాక సొసైటీకి యూనిట్ ఇసుక రూ.200లకే సరఫరా చేస్తున్నారు. ఇది అక్రమం అయినా లక్షల యూనిట్ల ఇసుక తోడేస్తున్నారు. ఇలా డ్రెడ్జర్‌తో తీసిన ఇసుకకు సొసైటీ నిర్వాహకులకు టన్నుకు ఆర్‌కే రూ.125 ఇస్తున్నారు. దానిని టన్ను రూ.525లకు విక్రయిస్తున్నారు.దీని వల్ల సొసైటీకి టన్నుకు రూ.125 చొప్పున లారీకి రూ.1250 ఇస్తున్నారు.అయితే ఆర్‌కే పది టన్నుల లారీ రూ.5250లకు విక్రయిస్తున్నాడు.ఒక్క పది టన్నుల లారీపై అతనికి రూ.4 వేలు మిగు లుతుంది.ఇలా ప్రతి రోజు వేలాది లారీలు ఇసుకను రవాణా చేస్తున్నాయి. అయితే ఇంతా కష్టపడిన సొసైటీలకు మాత్రం వచ్చే రూ.1250లో లోడింగ్‌కు రూ.200, రెండున్నర యూనిట్ల ఇసు కకు రూ.500 ఖర్చు కలిపి మొత్తం రూ.700 ఖర్చులై మిగిలిన రూ.550 వస్తుంది. కష్టపడిన వారికి రెండున్నర యూనిట్ల లారీకి రూ.550 మాత్రమే వస్తుండగా గట్టున కూర్చున్న వారు రూ.4 వేలు అక్రమ ఆదాయం సంపా దిస్తున్నారు. ఒకే బిల్లుపై రెండు మూడు ట్రిప్‌లు వేసే వారికి ఆదాయం పుష్కలంగా వస్తుంది. ఒక లారీకి ఇసుక రూ.5,250 పెట్టి ఇసుక కొనుగోలు చేసిన ట్రాన్స్‌పోర్టర్ దానిపై లోకల్ అయితే రూ.7 వేలు, నాన్‌లోకల్ అయితే రూ.10 వేలు, దూర ప్రాంతాలైతే మూడు యూనిట్ల లారీ రూ.15వేలకు వినియోగదారులకు చేరుతుంది. 18 టన్నుల లారీలు అయితే రూ.25 వేల పైమాటే ఉంది. అక్రమార్జన అంతా పెద్దల జేబుల్లోకి వెళ్లిపోతోంది. డ్రెడ్జర్లు ,మిషనరీల ప్రభావంతో కూలీలకు ,ఇసుకతీత పనులు చేసుకునేవారికి పనులు లేక ఇబ్బందులు పడుతు న్నారు. కష్టపడి పనిచేసిన సొసైటీలకు ట్రాన్స్‌పోర్టర్లకు కూలీ డబ్బులు వస్తున్నాయి.ఇసుక ర్యాంప్‌లు నిర్వహిస్తున్నవారికి మాత్రం కోట్లు కురుస్తున్నాయి. దీనిని ప్రశ్నించే వారే లేరు. నెలల ఖర్చుల కోసం సొసైటీలు, ఈఎంఐల కోసం లారీ ట్రాన్స్‌పోర్టర్లు రాజీ పడి చేస్తున్నారు.నిర్వాహకులు మాత్రం అందినకాడికి దోచుకుంటున్నారు.



శెట్టిబలిజ గౌడల ఆత్మీయ సమ్మేళనంలో సమైక్య అభివాదం చేస్తున్న నాయకులు మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, ఆదిరెడ్డి వాసు తదితరులు

కులాలను విభజించి వైసీపీ నాటకాలు

- టీడీపీలోనే శెట్టిబలిజ గౌడలకు ప్రాధాన్యం
- ఆత్మీయ సమ్మేళనంలో రెడ్డి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18 : కులాలను విభజించి వైసీపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు.రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి ఫంక్షన్ హాలులో ఆదివారం టీడీపీ శెట్టి బలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు నేతృత్వంలో జరిగిన శెట్టిబలిజ గౌడ ఆత్మీయ సమావేశంలో తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం తారకరత్న వర్ధంతిని పురస్కరించుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. శెట్టిబలిజ గౌడలకు ఏనాడో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ముందుకు తీసుకువచ్చింది టీడీపీ అన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఆదిరెడ్డి వాసు ఈ రోజు శెట్టిబలిజ, గౌడలను దత్తత తీసుకుంటున్నారన్నారు. శెట్టిబలిజ గౌడలు ఆత్మవిమర్శ చేసుకుని ఆదిరెడ్డి వాసును గెలిపించుకోవాలన్నారు. 1947లో స్వాతంత్రం దేశానికి వస్తే ఎన్‌టీఆర్ టీడీపీ పెట్టాకే వెనుకబడిన కులాలకు స్వాతంత్రం వచ్చిందన్నారు. వెనుకబడిన కులాలకు స్థానిక సంస్థల్లో ఎన్‌టీఆర్ 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారని చెప్పారు. కానీ ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించి రాష్ట్రంలో 16800 పోస్టులు పోవడానికి కారకుడయ్యారని విమర్శించారు. అటువంటి జగన్‌కు బుద్ధిచెప్పాలన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత శెట్టిబలిజ, గౌడలపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ టీడీపీని అన్న ఎన్‌టీఆర్ పెట్టింది బీసీల కోసమేనన్నారు. సీఎం జగన్ శెట్టిబలిజ గౌడలకు అన్యాయం చేశాడన్నారు. ఎంపీ భరత్ రామ్ సినిమా అయిపోయిందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ టీడీపీకి బ్యాక్ బోన్ బీసీలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు పదవులు కొత్తకాదన్నారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మన మధ్య వైసీపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక అమరనాథ్‌గౌడ్ తన అక్క కోసం వైసీపీ వారిని ఎదురిస్తే ఆ బాలుడుపై పెట్రోల్ పోసి చంపేశారని, అప్పుడు ఆ పార్టీ బీసీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రిజర్వేషన్లు 10 శాతం తగ్గించినప్పుడు ఏమి చేశారని ప్రశ్నించారు. శెట్టిబలిజ గౌడల ఆత్మగౌరవం ఎక్కడా తగ్గకుండా తాను చూసుకుంటానని చెప్పారు.జనసేన నగర అధ్యక్షుడు అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలను జగన్ నమ్మించి మోసం చేశాడన్నారు. 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి ఇప్పుడు నాటకాలు ఆడితే నమ్మేవారు లేరన్నారు. శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ శెట్టిబలిజగౌడలు టీడీపీకే ఎందుకు ఓటు వేయాలో చెప్పారు. ఆదిరెడ్డి వాసును ఎమ్మెల్యే, చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా శెట్టిబలిజ గౌడలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. వైజంక్షన్‌లో సర్దార్ గౌతు లచ్చన విగ్రహానికి ఆదిరెడ్డి వాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గీత కార్మికులు మోకులతో భారీ ర్యాలీ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీను, జోన్ -2 నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు,నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, బీసీ సెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు పవన్ కల్యాణ్ రాక

నాలుగు నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమీక్ష



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. విశాఖ నుంచి చాపర్‌లో మధ్యాహ్నం సుమారు ఒంటి గంటకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి కారులో రాజమ హేంద్రవరంలో ఉన్న జనసేన కార్యాలయానికి చేరుకుంటారు.సుమారు 2 గంటల పాటు ఇక్కడ ఉంటారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి ఇన్‌చార్జిలు, ముఖ్యమైన నేతలతో సమావేశం అవుతారు. జిల్లాలో జనసేన ఎక్కడి నుంచి పోటీ చేస్తుందో, అక్కడ జనసేన, టీడీపీ కేడర్‌తో ఎలా కలిసి పనిచేయాలో వంటి అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు.జిల్లాలో కనీసం రెండు స్థానాల్లో జనసేన పోటీ చేసే అవకాశం ఉన్నట్టు ఇప్పటికే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ ఇప్పటికే రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో పాటు రాజమ హేంద్రవరం రూరల్ సీటు గురించి ఇక్కడ ప్రస్తావన వచ్చే అవకాశం ఉంది.ఈ సీటు నుంచి సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పోటీ చేస్తానని చెబుతుండగా, జనసేన నేత, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ కూడా ఇక్కడ నుంచే పోటీ చేస్తానని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ ఇక్కడ సోమవారం నిర్వహించే సమావేశంలో ఈ ప్రస్తావన వచ్చే అవకాశం ఉంది. ఇక జిల్లాలో నిడదవోలు నియోజకవర్గం విషయంలో కూడా రకరకాల ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు ఇక కొద్దిరోజుల్లోనే రానున్నాయి.ఇంకా టికెట్లు ఖరారు కాలేదు. ఇవన్నీ ఇక్కడ ప్రస్తావనకు వచ్చే అవకాశం లేకపోలేదు.జనసేన అధినేత రానుండడంతో జిల్లాలోని జనసేన కేడర్‌తోపాటు టీడీపీలో కూడా ఉత్సాహం కనిపిస్తోంది.

పాత పింఛను ఇచ్చే వారికే ఓటు : యూటీఎఫ్

కొవ్వూరు, ఫిబ్రవరి 18 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, పాత పింఛను విధానాన్ని అమలుపర్చాలని నిర్ణయం తీసుకున్న రాజకీయ పార్టీకి ఎన్నికల్లో మద్దతు పలకనున్నట్టు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్ తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.జవహర్‌ను యూటీఎఫ్ నాయకులు కొవ్వూరులో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు. జయకర్ మాట్లాడుతూ సీపీఎస్ వల్ల ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.చాలా రాష్ట్రాలు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాయన్నారు. ఏపీలోను పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేసి గ్రాట్యుటీ, పింఛను సౌకర్యాలను కల్పించాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే పాత పింఛను విదానంపై స్పష్టమైన హామీ ప్రకటించి, మేని ఫెస్టోలో పెడుతుందో వారికే ఉద్యోగ, ఉపాధ్యాయులంతా మద్దతు తెలపాలని నిర్ణయించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు షరీఫ్, రూపస్, రమేష్, రవిబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీ కార్యాలయం తరలింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఆవరణలోని జోన్-2 ప్రాంతీయ వైద్య, ఆరోగ్యశాఖ సంచాలకుల వారి కార్యాలయాన్ని మల్లికార్జున నగర్‌లోని వైఎంసీఏ బిల్డింగ్‌లోకి తరలించారు. మల్లికార్జుననగర్‌లో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ రోడ్డులో సీటీఆర్ఐ ఆటోస్టాండుకు వెళ్లే దారిలో ఈ వైఎంసీఏ భవనం ఉంది. ఆర్‌డీ కార్యాలయం ఇప్పటి వరకూ జీజీహెచ్ ప్రాంగణంలోని ఒక భవనంలో కొనసాగింది. అయితే ఆర్‌డీ కార్యాలయ భవనాన్ని మెడికల్‌కాలేజీ అవసరాల నిమిత్తం ఏపీఎస్ఎంఐడీసీ అధికారులు తమ స్వాధీనంలోకి తీసుకోవడంతో ఆర్‌డీ కార్యాలయం తరలింపు అనివార్యంగా మారింది. ఈనెల 19వ తేదీ సోమవారం నుంచి కొత్త భవనంలో ఆర్‌డీ కార్యాలయం సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వైద్య ఉద్యోగులు దీన్ని గమనించాలని ఆర్‌డీ కార్యాలయం సూపరింటెండెంట్ సురేష్‌బాబు కోరారు.

అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

చూతము రారండి..



శ్రీలక్ష్మీనరసింహస్వామివారు

- నేడు రాత్రి 12:29 గంటలకు కల్యాణం
- భారీ బందోబస్తు ఏర్పాట్లు

అంతర్వేది, ఫిబ్రవరి 18: బుగ్గన చుక్కతో సిగ్గులు ఒలకపోస్తూ రథసప్తమినాడు పెళ్లి కుమారుడుగా దర్శనమిచ్చిన శ్రీ స్వామివారు సోమవారం రాత్రి ఉభయ దేవేరులను పరిణయమాడేందుకు సిద్ధమయ్యారు. పంచ భూతాల సాక్షిగా అఖండ జన సందోహం నడుమ ప్రతిఏటా మాఘమాసంలో కనుల పండువగా జరిగే శ్రీనారసింహుడి కల్యాణం చూసేందుకు రెండు కళ్లు చాలవు. కోరికలు తీర్చే శ్రీనారసింహుని పరిణయ వేడుక పదిరోజుల పాటు వైభవంగా జరుగుతుంది. ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు సోమవారం రాత్రి 12:29 గంటలకు(తెల్లవారితే మంగళవారం) కల్యాణం జరుగుతుంది.

కల్యాణ తంతు - ఎదురు సన్నాహం..

కల్యాణ కాంతులతో మెరుస్తున్న మేచు వర్ణుడు శ్రీస్వామివారు. కల్యాణానికి సిద్ధపడుతూ తొలుత కంచు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. తదుపరి పెళ్లి కుమారుడి తరపున ఆలయ అనువంశిక ధర్మకర్త మొగల్తూరు రాజ వంశీయులు, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహద్దూర్, పెళ్లి కుమార్తె తరపున అర్చక స్వాములు రాజా వారి వీధిలో ఎదురు సన్నాహాలు (ఒకరికొకరు బుక్కా చల్లుకోవడం) చేస్తారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు చేరుకుంటారు.

పల్లకీలో కల్యాణ వేడుకకు..

కల్యాణ మూర్తులైన శ్రీ స్వామివారు మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య పల్లకీలో కల్యాణ మండపం వద్దకు చేరుకుని సింహాసనంపై ఆసీనులవుతారు. అనంతరం అమ్మవారు పల్లకీలో కల్యాణ మండపం వద్దకు చేరుకోవడంతో కల్యాణ తంతు ప్రారంభం అవుతుంది. ఆలయ స్థానాచార్యులు రంగాచార్యులు సమక్షంలో ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో కల్యాణ తంతును జరుగుతుంది.

రక్షాబంధనం: కల్యాణ కార్యక్రమంలో నియమ నిబంధనలను సక్రమంగా నిర్వహించమని వేదమంత్రాలతో సర్వతో రక్షించమని కోరుతూ అర్చక స్వాములు రక్షాబంధనం చేస్తారు.

గోదానం: పవిత్రమైన దర్భాలతో (కూర్చ) గోవుగా భావించి గోదాన మంత్రాలతో గోదానం నిర్వహిస్తారు.

శుభ ముహూర్తం: మాఘమాసంలో ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశమందు సోమవారంరాత్రి 12:29గంటలకు (తెల్లవారితే మంగళవారం) శ్రీ స్వామివారు, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం అర్చక స్వాములు చేత సమర్పిస్తారు.

కన్యాదానం: కొబ్బరి బొండం, గుమ్మడికాయ, గంధపుచెక్క, అరటిపండ్లు, శ్రీభూదేవిలను స్వామివారికి దానం చేస్తారు.

సువర్ణయజ్ఞోపవేత ధారణ: సువర్ణ యజ్ఞోపవేత ధారణ శ్రీ స్వామివారికి, శ్రీభూదేవిలకు మంగళసూత్ర ధారణ నిర్వహిస్తారు.

ముత్యాల తలంబ్రాలు: పొలమూరి రాజుల సత్రం నిర్వాహకులచే సమర్పించబడిన మంచిముత్యాల తలంబ్రాలు ముందుగా అర్చక స్వాములు, స్థానాచార్యుల వారు, మొగల్తూరు రాజావారు, పొలమూరి రాజులు సమర్పిస్తారు.

బ్రహ్మముడి: అర్చక స్వాములచేస్వామి, అమ్మవార్లకు చమ్కీ దండలు, పూల దండలు సమర్పిస్తారు. అనంతరం ఆశీర్వచనాలు, మంగళ హారతి నిర్వహిస్తారు.



మూలవరులు

వార్షిక కల్యాణోత్సవ బంగారు ఆభరణాలు

కల్యాణోత్సవమూర్తులకు బంగారుఆభరణాలు ఇచ్చిన దాతలు అంతర్వేదికి చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకటసత్యనారాయణ, కుటుంబ సభ్యులు సమర్పించిన ఆభరణాలతో కల్యాణం జరుగుతుంది.





హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం , స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా స్వామివారి గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 18: అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి లక్ష్మీసూర్యనారాయణరాజు వారిచే నిర్మించిన హంస వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక స్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం 6.30 గంటలకు అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు. గరుత్మంతుడు చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై అర్చకులు ఎగురవేశారు. రాత్రి 8 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు గన్నాబత్తుల వెంకటరాజారావు లక్ష్మీనరసింహస్వామి వారిచే నిర్మితమైన శేషవాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామివారికి భక్తులు హారతులు పట్టి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రామగోపాల రాజాబహద్దూర్, ఆలయ సహాయకమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, మందపాటి వెంకటేశ్వర్లు, వనమాలి మూలాస్వామి, ఉత్సవ సేవాకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో నేడు...

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 7గంటలకు అర్చిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి వాహనం, రాత్రి 8.30 గంటలకు కంచుగరుడ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ సహాయక మిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలి

- చారిత్రక నేపథ్యం పాడవకూడదు
- ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి



భక్తులనుద్దేశించి అనుగ్రహ బాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 18: సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా ఉన్న భారతదేశంలో పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలని ఈ సందర్భంలో ఆలయాలకు చారిత్రక నేపథ్యం పాడవకూడదని పరమహంస పరివ్రాజక ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. కోరుకొండలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన ఆయన కొద్దిసేపు అనుగ్రహ భాషణం చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం ద్వారా కొన్నివేల సంవత్సరాల చరిత్రకు ప్రాణం పోసినట్టుయిందన్నారు. ఆనాడు శ్రీలంకకు రాముడు వేసిన సేతువు పదిహేడున్నర లక్షల సంవత్సరాలుగా నాసా ప్రకటించిందన్నారు. ఇది సహజంగా ఏర్పడింది కాదని మానవ నిర్మితమని తేల్చిచెప్పారని చినజీయర్ స్వామి గుర్తుచేశారు. ప్రపంచలో ఏ మూల అప్పటికి ఏ నాగరికత కళ్లు తెరవలేదన్నారు. అందువల్లే కొత్త ఆలయాలు నిర్మించడం కన్నా పాత ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ రామచంద్రమోహన్, అన్నవరం, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలు వేద పండితులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టి.. కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఒకరికి గాయాలు
- ఏడుగురు ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్



బెల్లంపూడి పంట కాల్వలోకి దూసుకుపోయిన కారు నుంచి ప్రయాణికులను బయటకు తీస్తున్న ఏఆర్ కానిస్టేబుల్

పి.గన్నవరం, ఫిబ్రవరి 18: అదుపుతప్పిన కారు బైక్‌ను ఢీకొట్టి ఆపై ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయిన సంఘటన పి.గన్నవరం మండలం బెల్లంపూడిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... రాజమహేంద్రవరంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఓ కుటుంబం తిరిగి తమ స్వగ్రామం శివకోడు కారులో వస్తూ.....మార్గంమధ్యలో బెల్లంపూడి గ్రామం వచ్చే సరికి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో మోటార్‌సైకిలిస్ట్ తాడాలవారిపాలెంనకు చెందిన యర్రంశెట్టి స్వామినాయుడు కాలుకు తీవ్రగాయం కాగా అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. కారులో ప్రయాణిస్తున్న కసుకుర్తి భాస్కరసుధీర్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. అలాగే ఆయన భార్య కె.సింధూ, పిల్లలు భాను, జయన్సు, తల్లి కె.పార్వతి, అత్తమామలు బిక్కిన సూర్యకాంతం, సుబ్బారాయుడులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా అటుగా వెళుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు సంఘటనాస్థలిని పరిశీలించి స్వామినాయుడును హుటాహుటిన ఆసుపత్రికి తరలించే ఏర్పాటుచేశారు. అయితే స్వామినాయుడు గతంలో టైలరింగ్ పనిచేసుకుని జీవనం సాగించేవాడు ఆరోగ్యం సహకరించకపోవడంతో గత కొన్నాళ్లుగా బెల్లంపూడి సెంటర్‌లో చిరువ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈప్రమాదంతో ఆకుటుంబం రోడ్డున పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడుగురు ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్..

తూర్పుగోదావరిజిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నెల్లి శ్రీనివాస్ ఉడిమూడి శివారు చింతావారిపేటలో ఒక వివాహవేడుకలో పాల్గొని తన కారులో మండల కేంద్రం పి.గన్నవరం వెళ్లారు. తిరిగి రాజమహేంద్రవరం బయలుదేరగా మార్గంమధ్యలో బెల్లంపూడిలో వచ్చే సరికి కళ్లెదుటే జరిగిన సంఘటనను చూశారు. వెంటనే స్పందించిన శ్రీనివాస్ చాకచక్యంగా వ్యవహరించి పంటకాల్వలోకి దూకి స్థానికుల సాయంతో ఏడుగురినీ ఒడ్డుకు చేర్చారు. శ్రీనివాస్‌ను స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబుతో పాటు ప్రయాణికులు బంధువులు, స్థానికులు అభినందనలు తెలిపారు. ఆ కుటుంబం ప్రాణాలు కాపాడి నిజమైన పోలీస్‌గా నిలిచారని ప్రసంశలు కురిపించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పంటకాల్వలోకి దూసుకుపోయిన కారుకు కాల్వలో పేరుకుపోయిన తూడు అడ్డేసింది. దీంతో కాల్వలోని కూతవేటు దూరంలో నీటిలో తేలియాడుతున్న కారు వద్దకు వెళ్లే సరికి నీరు వేగంగా ప్రవహిస్తోంది. వెంటనే డోరులు లాగి వలంటీర్ లక్ష్మణ్, స్థానికులు సాయంతో ఏడుగురును ఒడ్డుకు చేర్చాగలిగాను. తూడు లేకపోతే కారు కాల్వమధ్యలోకి వెళ్లి పెనుప్రమాదం సంభవించేది.



ప్రమాదం నుంచి బయటపడ్డ శివకోడు గ్రామానికి చెందిన ప్రయాణికులు

కాల్వ చెంతనే రక్షణగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి

రాజవరం-పొదలాడ రహదారిలో గంటి నుంచి పి.గన్నవరం వరకు ప్రధాన పంట కాల్వ వైపు రక్షణగా ఇనుప రైలింగ్‌లను ఏర్పాటు చేయాలి. అప్పుడే ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని స్థానికులు కోరుతున్నారు.



అట్లపాడు వద్ద స్కూటీ పై నుంచి పడి మృతి చెందిన లెక్చరర్



స్కూటీ నుంచి జారిపడి లెక్చరర్ మృతి

నిడదవోలు, ఫిబ్రవరి 18: స్కూటీ నుంచి జారిపడి ఓ లెక్చరర్ మృతిచెందారు. నిడదవోలులోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మెరకనల్లి ప్రసన్నకుమార్ (55) ఆదివారం నిడదవోలు నుంచి వేలివెన్ను వెళుతూ అట్లపాడువద్ద స్కూటీ అదుపుతప్పి జారిపడి రోడ్డుపై పడ్డంతో ముఖానికి తీవ్రగాయా లై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రసన్న కుమార్ కొద్దిరో జులుగా వేలివెన్ను శశి కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నా రు. ఆయనకు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ తెలిపారు.

రేపు ద్రాక్షారామ భీమేశ్వరుడి కల్యాణం



భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవారు

ఘనంగా ఏర్పాట్లు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18: ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రం, పంచారామం ద్రాక్షారామలో ఉన్న మాణిక్యాంబసమేత భీమేశ్వరస్వామివారి దివ్యకల్యాణం 20న మంగళవారం నిర్వహించనున్నారు. స్వయంభువుడు శ్రీభీమేశ్వరస్వామి వారు, ద్వాదశశక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారికి, క్షేత్రపాలకులు శ్రీలక్ష్మీసమేత నారాయణస్వామివారు, శ్రీచండిక సమేత సూరేశ్వరస్వామివార్లకు ఒకే వేదికపై మంగళవారంరాత్రి ఆరుద్ర నక్షత్ర తులాలగ్నమందు రాత్రి 10.25నిమిషాలకు ఏకకాలమందు కల్యాణ మహోత్సవం జరుగుతుంది.

స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్షలతో పూజ

మంగళవారం ఉదయం 5.45కు కల్యాణమూర్తులను ఆహ్వానిస్తారు. స్వామి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ఉదయం 8.00 గంటలకు భీమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 3.05 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, 5 గంటలకు నందివాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. అనంతరం రాత్రి 10.25 నిమిషాలకు స్వామివార్ల కల్యాణం దేవస్థానం బ్రహ్మదేవులపల్లి పణిరామకృష్ణచే జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

కల్యాణ కార్యక్రమాలు

21న గరుడవాహనంపైస్వామివారి నగరోత్సవం జరుగుతుంది. 22న ఉదయం 9గంటలకు నగరోత్సవం, సాయంత్రం 4.45 గంటలకు స్వామి వార్ల సదస్యం, పండిత సత్కారం రాత్రి 8.45కు సర్వవాహనములపై స్వామివారి నగరోత్సవం నిర్వహిస్తారు. 23న మధ్యాహ్నం 2.35 గంటలకు భీమేశ్వరుని రథోత్సవం, సాయంత్రం 6.00 గంటలకు వేగాయమ్మపేట ఆస్థాన మండపంలో స్వామివార్ల ఆస్థాన పూజ జరుగుతుంది. 24న ఉదయం 8.10గంటలకు స్వామి వసంతోత్సవం, నాకబలి, తదుపరి త్రిశూ ల, శ్రీ చక్ర స్నానం జరుపుతారు. 25 రాత్రి 7.05 గంటలకు సప్తగోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 26న రాత్రి 7.05లకు స్వామివారి శ్రీపుష్పోత్సవం జరుగుతుంది.

శోభాయమానంగా కల్యాణవేదిక

భీమేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ అంతర ప్రాంగణంలో శోభాయమానంగా కల్యాణ వేదికను భారీగా తీర్చిదిద్దారు. స్వామి కల్యాణం వేలాదిమంది తిలకించేందుకు ప్రత్యేకంగా పందిర్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులకుస్వామి తీర్థప్రసాదాలతోపాటు, స్వామివారి కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందజేస్తామని ఆలయ ఈవో పి.టి.వి. సత్యనారాయణ తెలిపారు.

దేవస్థానం అన్నదాన మండపం ప్రారంభం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం అన్నదాన మండపం ఆదివారం ఉదయం 10.42 గంటలకు ప్రారంభించారు. రూ.1.5కోట్లతో నిర్మించిన అన్నదాన మండపాన్ని వ్యాపారవేత్త సత్తిసుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు, కుటుంబీకులు పూజాదికాలు నిర్వహించి భవనం ప్రారంభించారు. అన్నదాన మండపం సత్తిసుబ్బారెడ్డి దంపతులు నిర్మించారు. తొలిరోజు 5 వేలమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, వైస్ ఎంపీపీలు శాకా బాబి, నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఈవో పి.టి.వి. సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామి అన్నదాన మండపం ప్రారంభిస్తున్న సత్తిసుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు

దగా పడ్డ దళితులు : మహాసేన రాజేష్



నిడదవోలులో దళితుడా రా కదలిరా సభలో ప్రసంగిస్తున్న మహాసేన రాజేష్

నిడదవోలు, ఫిబ్రవరి 18: ఎంతో పౌరుషం ఉన్న దళితులు వైసీపీ ప్రభుత్వంలో దగా పడ్డారని, జగన్‌రెడ్డి దళితులను నమ్మించి మోసం చేశాడని, మోసపోయిన దళితులు 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మహాసేన రాజేష్ అన్నారు. నిడదవోలు లోని బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో ఆదివారం దగాపడిన దళితుడా రా.. కదలి రా.. కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనవాళ్లెవరో పగవాళ్లెవరో తెలుసుకుందామని దళితులకు గౌరవం ఇస్తున్న చంద్రబాబు, లోకేశ్‌లకు అండగా ఉండి 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. వైసీపీ పాలనలో దళితులు హత్యకు గురవుతున్నారని, టీడీపీ పాలనలో దళితులు రాజకీయంగా ఎదిగేందుకు ఎంతో భవిష్యత్తు ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు దళితులు ఆరాటపడక్కరలేదని, అందరికీ ఇస్తున్న పథకాలే ఇస్తున్నారని, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఇచ్చేవి ఏమీ లేవన్నారు. అన్ని రంగాల్లో ఉన్న దళితులు అభివృద్ధి చెందాలని, అది టీడీపీ ప్రభుత్వం హయాంలోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి బాధ్యత అని రాజేష్ అన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

ఇద్దరు యువకుల మృతి

- మరొకరి పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదానికి గురైన యువకులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18: అయినవిల్లి మండలం మాగం నుంచి అమలాపురం పల్సర్ మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సిరిపల్లి-మునిపల్లిరోడ్డులో ముమ్మిడివరం మండలం అనాతవరం పంచాయతీ పరిధిలో గుబ్బలవారిపాలెం వద్ద ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అమలాపురంనకు చెందిన అడబాల సాయి హర్ష(23) అక్కడికక్కడే మృతి చెందాడు. పెదపట్నంలంకకు చెందిన కొమ్ముల అనిల్(21) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమలాపురానికి చెందిన యండమూరి లోకేష్(23) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. హర్ష మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దరాప్తు చేపట్టారు. ఈముగ్గురు మిత్రుల్లో ఆడబాల హర్ష ఇటీవల మోటార్‌సైకిల్ కొనుగోలు చేశాడు. వీరిలో బీటెక్ వరకు చదువుకున్న హర్ష అయినవిల్లి మండలం మాగంలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్నాడు. వారి తల్లిదండ్రులకు ఇద్దరు మగసంతానం. లోకేష్ డిగ్రీ వరకు చదువుకుని ప్రస్తుతం ఉద్యోగం చేసుకుంటున్నాడు. కొమ్ముల అనిల్ ఇటీవలే గల్ఫ్ నుంచి తిరిగివచ్చాడు.



తాళ్ళపోడులో కాలిపోతున్న బస్సు

పార్కింగ్ చేసిన చోటే.. కాలేజీ బస్సు దగ్ధం

కె.గంగవరం, ఫిబ్రవరి 18: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం తాళ్ళపోడులో ఆదివారం ఉదయం పార్కింగ్ చేసిన బస్సులో మంటలు వ్యాపించి దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నా యి. తాళ్ళరేవు మండలం సుంకరపాలెం పరిధిలోని రవి జూనియర్ కాలేజీ బస్సు తాళ్ళపోడు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులను కళాశాలకు తరలిస్తుంది. ఆదివారం కావడంతో తాళ్ళపోడులోనే పార్కింగ్ చేశారు. ఆదివారం ఉదయం ఉన్నట్టుండి బస్సు నుంచి మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు అదుపు చేశారు. అప్పటికే బస్సు చాలావరకూ కాలిపోయింది. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. పామర్రు ఎస్.ఐ. జానీబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సందేశాత్మకంగా సాగిన నాటికలు

తాటిపర్తిలో ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 18: మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత, కుటుంబ విలువలు ప్రాధాన్యతను చాటిచెబుతూ నాటికల ప్రదర్శనలు కొనసాగాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు రెండో రోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి.ప్రేమ విలువను తెలియచెబుతూ ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక అందరినీ ఆలోచింప చేసింది. ప్రేమ అనేది సృష్టిలో ఎంతో గొప్పదని, అది సమాజంలో అందరూ హర్షించేలా ఉండాలే తప్ప, అనాలోచిత నిర్ణయాలతో తప్పటడుగులు వేయకూడదని ఈ నాటిక ద్వారా చాటిచెప్పారు. గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోపి సత్యప్రకాష్(స్నిగ్ధ) రచించగా, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.

బిడ్డలపై అమ్మకు ఉండే అనురాగం, ప్రేమ చాటిచెప్పిన..

అమ్మ మనస్సు, బిడ్డలపై ఆమెకు ఉండే ప్రేమ, అనురాగం చాటిచెబుతూ కౌసల్య సుప్రజ రామా నాటికను ప్రదర్శించారు. పురాణాలు, వేదాలు, సమాజాలు, ఓంకార నాదాలకు ఒక ధర్మం ఉన్నట్టే అమ్మ మనస్సుకు ఒక ధర్మం ఉంటుంది. అదే కనిపెంచిన ధర్మం, మనకు కనిపించని ధర్మం అంటూ అమ్మ విశిష్టతను చాటిచెప్పింది. రామాయణంలో రాముడు అడవులకు వెళ్లినప్పుడు తల్లి కౌసల్య ఎంత బాధపడుతుంది, అతని కూడా వెళ్లకపోయినా మనస్సు మాత్రం అతని ఉన్న విధంగానే నేడు బిడ్డలు వద్దని వదిలించుకుంటున్నా, సముద్రాలు దాటి విదేశాలకు వెళ్లిపోతున్నా అమ్మ మనస్సు మాత్రం వారిని అంటి పెట్టుకునే ఉంటుందని, ఇది అందరూ గమనించాలని సందేశాన్నిచ్చారు. కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోపి సత్యప్రకాష్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.



స్వీకారం నాటికలోని దృశ్యం

భార్యను వదిలివేస్తే కుటుంబమే వెలివేసింది

- కుటుంబ విలువల విశిష్టతను చాటిచెబుతూ స్వీకారం నాటిక

కుటుంబ విలువలను చాటిచెబుతూ అది మీరితే అందరికీ దూరమవ్వాల్సి ఉంటుందనే సందేశాన్నిఇస్తూ స్వీకారం నాటికను ప్రదర్శించారు. సంప్రదాయబద్ధంగా ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మహిళను విదేశాల్లో ఉన్న కొడుకుకు ఇచ్చి వివాహం చేస్తాడు ఒక తండ్రి. అయితే అక్కడే ఉన్న వేరే మహిళతో డేటింగ్‌లో ఉండి తన భార్యకు విడాకులు ఇస్తాడు. దీంతో అతని తండ్రి కోడలును దత్తత తీసుకుంటారు. ఇది తెలిసి స్వదేశానికి వచ్చిన కొడుకు ప్రశ్నిస్తూ నీవు నీ భార్యకు విడాకులు ఇవ్వడం కాదు. నేనే మీకు విడాకులు ఇస్తున్నామని తల్లిదండ్రులు చెబుతారు. మా ఆస్తికి ఆమే వారసురాలని ప్రకటిస్తారు. అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యను లేదా భర్తను వదిలివేసే వారికి తండ్రులు ఇచ్చే తీర్పు ఇదేనని నాటిక ద్వారా తెలియజెప్పారు. అమలాపురం రసవాహిని కళాకారులు ప్రదర్శించిన స్వీకారం నాటికను రావి నాగేశ్వరరావు రచించగా, మహ్మద్ షహెన్నా దర్శకత్వం వహించారు.



తాటిపర్తిలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక

ఏజెన్సీ సమాచారం

ఘనంగా రాజులబాబు పండుగ



ఆదివారం చింతకర్రపాలెం గ్రామంలో రాజులబాబు పండుగలో భోజనాలు చేస్తున్న గిరిజనులు

వై.రామవరం, ఫిబ్రవరి 18: మన్యంలో అడవిరాజులబాబు పండుగలను పలు గిరిజన గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని చింతకర్ర పాలెం, బండిగడ్డ, సింగవరం, జాజిగడ్డ, పనసలపాలెం తదితర గ్రామాల్లో పండుగలు నిర్వహించారు. అటవీప్రాంతాల్లో మామిడిచెట్ల క్రింద ప్రతీఏటా మహాశివరాత్రికి నెలరోజుల ముందు నుంచి ఈ పండుగలు జరుపుకోవడం ఇక్కడ సంప్రదాయం. చెట్లకింద వెదురుబద్దలతో విల్లంబులు తయారుచేసి వడ పప్పు, కోడిగుండెకాయలు రాజులుబాబుకు నైవేద్యంగా పెడతారు. అనంతరం కోడిమాంసాల వంటకాలతో జీలుగుకల్లు సేవించి సహపంక్తి భోజనాలు చేస్తారు. కొండకోనల్లో సంచరించే తమకు ఆపదలు సంభవించకుండా కాచికాపాడా లంటూ రాజులబాబుకు మొక్కులు చెల్లించుకుంటారు.

ఆదివాసీ నిరుద్యోగ ఉపాధ్యాయ పట్టభద్రుల సమావేశానికి తరలిరండి



● ఆదివాసీ నాయకుడు శేఖర్

దేవీపట్నం, ఫిబ్రవరి 18: నేడు రంపచోడవరంలో జరిగే ఆదివాసీ నిరుద్యోగ ఉపాధ్యాయ ట్రైనింగ్ పొందిన పట్టభద్రులంతా సమావేశానికి తరలిరావాలని ఆదివాసీ జేఏసీ, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆయన మాట్లా డుతూ ఇటీవల ఏపీ ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌లో ఉపాధ్యాయ ట్రైనింగ్ పొందిన ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈవిషయంపై చర్చించేందుకు, భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు సమా వేశం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని టీచర్ ట్రైనింగ్ పొందిన ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రులంతా తప్పనిసరిగా హాజరుకావా లన్నారు.

ఎంపీటీసీకి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వేగి నాగేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల

మోతుగూడెం, ఫిబ్రవరి 18: మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వర రావును మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆదివారం పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం ఆయన అనారోగ్యానికి లోనయ్యారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కా ర్యక్రమంలో చింతూరు మండల పార్టీఅధ్యక్షుడు చిన్నారెడ్డి, సెక్రటరీ వెంకటేశ్వ రరావు, అరకు పార్లమెంటరీ మైనార్టీ సెక్రటరీ రియాజ్, మండల మాజీ అధ్యక్షు డు ఓబుల్ వల్లి రామారావు, చౌదరి యూత్ ప్రెసిడెంట్ గద్ద సురేష్‌చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నరసింహారావు, మోతుగూడెం టీడీపీ కార్యకర్తలు పాసి రమణ, చిన్న గౌతమ్, సాయి శ్రీను, భీమరాజు, సాయిసేతు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలి



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరావు

రంపచోడవరం, ఫిబ్రవరి 18: ఏజెన్సీ పర్యాటకానికి వచ్చే పర్యాటకులు జాగ్ర త్తలు పాటించాలని సీఐ వాసా వెంకటేశ్వరావు అన్నారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ తూహీన్ సిన్హా ఆదేశాల మేరకు ఆదివారం ఐ.పోలవరం పర్యా టక ప్రదేశంలో పర్యాటకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ విహారయాత్రలకు వచ్చే పర్యాటకు లు సరైన అవగాహన లేక, కొంతమంది మద్యం సేవించి వాహనాలు నడప డంతో తరచూ ప్రమాదాల గురవుతున్నారన్నారు. కార్యక్రమం ఆదనపు ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం మండలం నుదురుబాదు గ్రామానికి చెందిన బండారు వెంకట రామశంకర్(22) తన స్నేహితులు 9 మందితో కలిసి విజయవాడ నుంచి మారేడుమిల్లి మోటారుసైకిళ్ళపై బయలుదేరారు. ఎన్‌హె చ్-16 జాతీయ రహదారిపై కొవ్వూరు మండలం కాపవరం సమీపంలో ఎదురుగా జంతువు రావడంతో సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన రామశంకర్‌కు తలకు గాయం కాగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ రామశంకర్ ఆదివారం మృతిచెందారు. ఆసుపత్రి సమా చారం మేరకు మృతుడి స్నేహితుడు విశ్వనాధపల్లి జశ్వంత్‌రాజ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం



కొవ్వూరు, ఫిబ్రవరి 18: గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరులోని ఔరంగాబాద్ ఇసుకర్యాంపు సమీపంలో గోదావరి నదిలో మృతదేహం తేలుతుందని స్థానికుల సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు సిబ్బందితో సంఘ టనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి, ప్రభుత్వాసుప త్రికి తరలించారు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, చేతిపై డాడి, మోహన్ అని పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడు జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలకు చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

కొవ్వూరు పోలీసుస్టేషన్ నిర్మాణానికి చర్యలు

» డీఎస్పీ రామారావు..సబ్‌జైలు ప్రాంగణం పరిశీలన

కొవ్వూరు, ఫిబ్రవరి 18: కొవ్వూరు సబ్‌జైలు ప్రాంగణంలో పట్టణ పోలీసుస్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. ఆదివారం సబ్‌జైలు ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ కొవ్వూరులో మోడల్ పోలీసుస్టేషన్ మంజూరైందని, దాని నిమిత్తం స్థానిక గోదావరి ఏటిగట్టు రోడ్‌పై పాత రైలు వంతెన వద్ద మున్సిపల్ తాత్కాలిక డంపింగ్ యార్డు స్థలంలో 35 సెంట్లు మోడల్ పోలీసుస్టేషన్‌కు కేటా యించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ స్థలానికి సబ్‌జైలు నిర్మాణానికి అందించి, ప్రస్తుతం కొవ్వూరు సబ్‌జైలు ఉన్న 28 సెంట్లు భూమిలో మోడల్ పోలీసుస్టేషన్ నిర్మిస్తామన్నారు. దానిలో భాగంగా ఆదివారం సబ్‌జైలు ప్రాంగణా న్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సీఐ వి.జగదీశ్వరరావు, సిబ్బంది శ్రీనివాస్, సీహెచ్ బాబూరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక స్పందన

రాజమహేంద్రవరం రూరల్ , ఫిబ్రవరి 18: ప్రతినెల మూడో సోమవారం కలెక్టర్ డాక్టర్ మాధవీలత, ఎస్పీ పి.జగదీశ్‌లు క లిసి కలెక్టరేట్‌లోనే ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తు న్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. జిల్లాపరిధిలో డివిజన్, మండల, గ్రామ సచివాలయ స్థాయిల్లో స్పందన యధావిధిగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

పాత ఆలయాలకు పూర్వ వైభవం తేవాలి

» చారిత్రక నేపథ్యం పాడవకూడదు

» ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి



కోరుకొండ నరసన్న ఆలయ మెట్ల మార్గం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన నిర్వహిస్తున్న చినజీయర్ స్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 18: అందువల్లే కొత్త కాలయాలు నిర్మించడం కన్నా పాత ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడం ముఖ్యమని పరమహంస పరివ్రాజక ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. కోరుకొండలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు ఆయన ఆదివారం ఇక్కడికి వచ్చారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కం పూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మిలతో కలిసి రూ.3.80కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో శంకుస్థాపన చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తదుపరి నరసన్న కొండ మెట్ల మార్గం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.1.40 కోట్లతో చేపడుతు న్న రంగనాథస్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా కళాప్రకర్షణ, బాలా లయ మహాసంప్రోక్షణ కార్యక్రమం చినజీయర్ నిర్వహించారు. అనంతరం కొండ కొద్ది దూరం ఎక్కి అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. తదుప రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన సభలో అనుగ్రహ భాషణం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా ఉన్న భారతదే శంలో పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలని ఈ సందర్భంలో ఆల యాలకు చారిత్రక నేపథ్యం పాడవకూడదన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం ద్వారా కొన్ని వేల సంవత్సరాల చరిత్రకు ప్రాణం పోసినట్టుయింద న్నారు. ఆనాడు శ్రీలంకకు రాముడు వేసిన సేతువు పదిహేడున్నర లక్షల సంవత్సరాలుగా నాసా ప్రకటించిందన్నారు. ఇది సహజంగా ఏర్పడింది కాదని మానవ నిర్మితమని తేల్చిచెప్పారని చినజీయర్ స్వామి గుర్తుచేశారు. ప్రపం చంలో ఏ మూల అప్పటికి ఏ నాగరికత కళ్లు తెరవలేదన్నారు. అందువల్లే కొత్త ఆలయాలు నిర్మించడం కన్నా పాత ఆలయాలకు పూర్వ వైభవం తీసుకు రావడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ రామచంద్రమోహన్, అన్నవరం, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలు వేద పండితులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అన్నవరం దేవ స్థానం జాయింట్ కమిషనర్ రామచంద్రమోహన్, వేద పండితులు, లక్ష్మీనర సింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పరాసరరంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీన రసింహ భట్టర్, పరాసర రఘునాథ భట్టర్, అర్చకస్వాములు, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరావు, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, తాడి రజని, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, వాకా నరసింహారావు, నక్కా రాంబాబు, కటకం చటం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే 'రుడా' లక్ష్యం

చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు



శిలాఫలకం ఆవిష్కరించిన

» అనపర్తి, కొమరిపాలెంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

అనపర్తి, ఫిబ్రవరి 17: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రుడా పనిచేస్తోందని రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆదివారం అనపర్తిలో బాలుర ఉన్నత పాఠశాల వద్ద, బిక్కవోలు మండలం కొమరిపాలెంలో రుడా నిధులతో చేపట్టే సుందరీకరణ పనులకు ఆయన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ రుడా పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. అనపర్తి కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎన్ఎంఎం బాలకృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, కొమరిపాలెంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పరికరాల అందజేత

పులగుర్తలోని చేనేత సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పులగుర్త క్లస్టర్ డెవలప్‌మెంట్ కోసం న్యూఢిల్లీలోని చేనేతశాఖ 2022-23 ఆర్థిక సంవత్సరానికి 223మంది చేనేత కార్మికులకు పరికరాల కొనుగోలు కోసం రూ.1.20కోట్లు మంజూరు చేసింది. దీనిలో భాగంగా తొలి విడతలో రూ.23 లక్షల విలువైన పరికరాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. అలాగే గ్రా మంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. వేణుగోపాల స్వామి దేవస్థానం నిధులు రూ.3.20లక్షలతో తయారు చేయించిన బంగారు చైను, మంగళ సూత్రాలు, వెండి నామాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా స్వామి వారికి బహూకరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం

» మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.. టీడీపీలో పలువురి చేరిక



రాజమహేంద్రవరంలో టీడీపీలో చేరిన యువకులతో దుర్గేష్, ఆదిరెడ్డి, అనుశ్రీ

గోకవరం, ఫిబ్రవరి 18: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైసీపీని తరిమి కొట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తిరుమలాయపాలేనికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు ఆదివారం జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌ను మరోమారు నమ్మి మోసపోయే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పురంశెట్టి శివాజీ, ఉండమట్ల దొరబాబు, సుంకవిల్లి రాజు, కోడూరి సత్యనారాయణ, పిల్లా వీరబాబు, వాకాడ బుజ్జి పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమిలో వంద మంది చేరిక

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18: ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీల నేతలు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 25వ డివిజన్‌లో ఆదివారం రాత్రి ఆర్లపల్లి శ్రీరామ్‌మూర్తి (బబ్లు),ముద్రగడ జయరామ్‌ల ఆధ్వర్యంలో సమారు వంద మంది యువకులు టీడీపీ-జనసేన కూటమిలో చేరారు. వారందరికీ మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్టీ కండువాలతో స్వాగతించారు.

అంబేడ్కర్ లేకపోతే నీ బతుకెక్కడ జూపూడి: కాశి నవీన్

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ లేకపోతే నువ్వెక్కడ నీ బతుకె క్కడ జూపూడి ప్రభాకర్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ ఆది వారం ఓ ప్రకటనలో అన్నారు. అంబేడ్కర్ పేరును మారిస్తే నీలాంటి జాతి ద్రోహులు అంగీకరిస్తారేమోగాని ఆ మహనీయుడి వల్ల అన్ని హక్కులు పొం దిన తాము ఒప్పుకోబోమన్నారు. తక్షణమే జూపూడి ప్రభాకర్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని, దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అందరికీ విద్య నినాదంతోనే పీటీఎస్ఎఫ్

ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు



పీటీఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ముప్పాళ్ల సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18: సమాజంలో విద్య ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రాముఖ్యతను ఇచ్చినప్పటికి సామాన్యులకు ,పేదలకు అందని ద్రాక్షగానే ఉందని ఈ తరుణంలో అందరికి విద్య నినాదంతో పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటెడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ న్యాయవాది ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. ఆనం కళాకేం ద్రంలో జరిగిన కార్యక్రమంలో పీటీఎస్ఎఫ్ పతాకాన్ని ముప్పాళ్ల ఆవిష్కరిం చారు.సమాజాభివృద్ధికి పీటీఎస్ఎఫ్ ఏర్పాటు చేశామని వ్యవస్థాపకుడు కొల్లాపు వేణు అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములుగు కిరణ్ కుమార్, కొనగళ్ళ సుదర్శన్ రావు, కాకర్ల హరిబాబు, చెరు కూరి సత్యనారాయణరాజు, డాక్టర్ కెబి వేణుగోపాల్, పెద్దిరాజు, దారా ఏసు రత్నం, రవీంద్ర, జెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

చినపాలమూరులో మాచరమ్మ జాతర

అనపర్తి, ఫిబ్రవరి 18: మండలంలోని చినపాలమూరు గ్రామ దేవత మాచరమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు మాజీ ఎంపీటీసీ కోశెట్టి నాగమణి శ్రీనివాస్ దంపతులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిడి కృష్ణారెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి

టీడీపీ నేత ఆదిరెడ్డికి యూటీఎఫ్ వినతి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18: పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, రాజమహేంద్రవరం ఇన్‌చార్జి ఆదిరెడ్డి శ్రీనివాస్‌లకు వినతిపత్రాలు అందించారు. ఆదివారం వారిని ఇళ్ల వద్ద యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, జె.రూపస్, కె.రమేష్‌బాబు, ఎన్.రవి బాబు, కేవీఎన్ ప్రకాశరావు కలిసి వినతిపత్రాలు అందించారు. సీపీఎస్‌ను వారం రోజుల్లో రద్దుచేసి పాత పింఛను విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి దానిని నెరవేర్చకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని, ఓపీఎస్ అమలుకు సహకరించాలని వారు కోరగా ఈ అంశాన్ని తమ పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామని వారు హామీ ఇచ్చారు.

నువ్వులేక.. నేను లేను!

భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య మృతి



సత్యనారాయణ, వరలక్ష్మి మృతదేహాలు

గోకవరం, ఫిబ్రవరి 18 : భర్త మరణాన్ని తట్టుకోలేక గంటన్నర వ్యవధిలోనే భార్య కూడా మృతి చెందిన విషాద ఘటన ఇది. గోకవరం మండలం తంటికొండ గ్రామానికి చెందిన కోసూరి సత్యనారాయణ(77) అనారోగ్యంతో శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి వద్ద మృతిచెం దాడు. అప్పటి వరకూ తమతో ఉన్న తన భర్త ఇకలేడని తెలిసి మృతదే హాన్ని పట్టుకుని భార్య వరలక్ష్మి(65) వెక్కి వెక్కి ఏడ్చింది..అలా ఏడుస్తూనే 11.30 గంటల సమయంలో భర్త మృతదేహాన్ని పట్టుకుని అలా ఉండి పోయింది. బంధువులు తట్టిలేపినా లేవలేదు. దీంతో కంగారుపడిన కుటుం బీకులు వైద్యుడిని పిలిపించి చూపించగా అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. బంధువులు ఇద్దరిని విగతజీవులుగా చూసి కన్నీటిపర్యంతమ య్యారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దంపతు లకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. నిన్నటి వరకూ తమ మధ్య తిరిగిన దంపతులు ఒకేరోజు మృతి చెందడం చాలా బాధాకరమని గ్రామ స్థులు ఆవేదన చెందుతున్నారు. మృతులకు కుమార్తె కుమారుడు ఉన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఫిబ్రవరి 18: మండలం తిమ్మరా జుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉద యం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహా రతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనా మ కుంకుమ పూజలు చేశారు. అనంతరం క్షీర నివేదన, మహానివేదన చేపట్టారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మ వారిని భక్తులు దర్శిం చుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేశారు. అమ్మ వారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.1,14,914 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

ఘనంగా శ్రీరాజ శ్యామల పూర్ణాహుతి

రాజమహేంద్రవం సిటీ ఫిబ్రవరి 18: రాజమహేంద్రవరం ఆర్యాపురం గోదావరి ఒడ్డున ఉన్న శ్రీ కాలభైరవ స్వామి క్షేత్రంలో ఆదివారం కాలభైరవ గురుస్వామీజీ ఆధ్వర్యంలో రాజశ్యామల గుప్తనవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం శ్రీ రాజశ్యాల మాతకు గుజరాత్ నుంచి వచ్చిన త్రయంబకేశ్వర మహారాజ్ స్వామిజీ విచ్చేసి అమ్మవారికి సారే సమ ర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మాతకు సప్తనదీ జలాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, లక్షకుంకుమార్చన, లక్షపుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మరం ట్రస్టీ మహేశ్వరి, హేమాంబరి, రత్నసాగర్, జయప్ర కాష్ సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువ వైద్యుల్లో సేవాగుణం ఉండాలి

సినీ నటుడు, మోటివేషనల్ స్పీకర్ ప్రసాద్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, మోటివేషనల్ స్పీకర్ ప్రసాద్



రాజానగరం, ఫిబ్రవరి 18: యువ వైద్యులు ధనార్జనే ధ్యేయం కాకుండా తమ వద్దకు వచ్చే రోగుల పట్ల దయతో పాటు సేవాగుణం కలిగి ఉండాలని సినీ నటుడు, సాఫ్ట్‌స్కిల్ ట్రెయినర్, మోటివేషనల్ స్పీకర్ కేవీ ప్రసాద్ ఆకాంక్షించారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 2023-24 బ్యాచ్ ఫ్రెషర్స్ డే ఉద్భవ్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి మనిషి పుట్టుకతో గొప్పవారు కాలేరని, లక్ష్య సాధనతో ఉన్నత శిఖరాలను చేరుకోగలరన్నారు. అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి ఎనలేని సంతృప్తి పొందవచ్చన్నారు. అనంతరం వైద్య విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్యా విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డీన్ డాక్టర్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎం మిశ్రా, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమైన ఓటును అమ్ముకోకండి

సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరబాబు



పాదయాత్ర చేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు వీరబాబు

సీతానగరం, ఫిబ్రవరి 18: పవిత్ర మైన ఓటు హక్కును సొమ్ములకు అమ్ముకోవద్దని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పలివెల వీరబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన చినకొండేపూడిలోని పార్టీ కార్యాలయం నుంచి గణేశ్వరరావు హాస్పిటల్ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఇప్పటి వరకు నాలుగు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించినట్టు చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ కిల్లారి శ్రీదేవి, గోపాలపురం నందమూరి చిట్టి సాంబ, కొవ్వూరు సిద్దే నాగరాజు, పెద్దాపురం పలివెల లోకేష్‌లను అభ్యర్థులుగా ప్రకటించినట్టు చెప్పారు. మరో మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు. కాగా ప్రజలు ఓటు హక్కును అమ్ముకుని రాష్ట్రాన్ని, మన బతుకులను నాశనం చేసుకోవద్దని, రాష్ట్ర ప్రయో జనాలు, ప్రాంత ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని, సరైన నాయకుడిని ఎన్నికోవాలని వీరబాబు సూచించారు.

కోరుకొండలో అగ్నిమాపక కేంద్రం

ప్రారంభించిన హోం మంత్రి తానేటి వనిత



శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రు వనిత, వేణు

కోరుకొండ, ఫిబ్రవరి 18: ఎన్నో సంవత్సరాలుగా రాజానగరం నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛగా మిగిలిపోయిన కోరుకొండలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు సాకారమైందని మంత్రులు తానేటి వనతి, చెల్లుబోయిన వేణుగోపా లకృష్ణ అన్నారు. ఆదివారం సాయంత్రం కోరుకొండ మండల పరిషత్ కార్యా లయ ఆవరణలో రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన అగ్నిమాపక కేంద్రాన్ని ఎమ్మెల్యే రాజాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సదస్సులో మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలో అవసరమైన చోట అగ్నిమా పక కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కోరు కొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లోని 17 మేజర్ గ్రామ పంచాయతీ లకు అగ్నిమాపక కేంద్రం ద్వారా సర్వీసులు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుల్లి సూర్యకుమారి, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, కొయిడాల నానాజీ, జాజుల రాము, ఎంపీటీసీ కాలచర్ల నాగేశ్వరరావు, రాష్ట్ర విపత్తులు, అగ్నిమా పక సేవలు శాఖ అదనపు సంచాలకులు ఈ.శ్రీనివాసులు, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఈ.స్వామి, జిల్లా అధికారి డీహెచ్ఎంఎల్ సింగ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్ ప్రాక్టికల్స్‌కి 89 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టి కల్ పరీక్షలకు జిల్లాలో ఆదివారం 3,121 మంది హాజరుకాగా 89 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం కలిపి 85 సెంటర్లలో పరీక్షలు నిర్వహించామన్నారు. అన్ని సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలకు హాజరుకావాలన్నారు.

ఇసుక తోడేళ్లు!

గోదారంతా ఇసుక డ్రెడ్జింగ్



దోపిడీ సాగుతుందిలా : గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్ పడవ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18 : గోదారంతా తవ్వేయ్.. అందినకాడకు దోచెయ్.. అన్న చందాన జిల్లాలో అక్రమ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.రాజమహేంద్రవరం అర్బన్‌లో కోటిలింగాలు 1,3,4 ర్యాంప్‌లు, రూరల్ పరిధిలో కాతేరు 1 నుంచి 10 వరకు, గాయత్రిలో ఆరు ఇసుక ర్యాంప్‌లు ఉన్నాయి. కోటిలింగాలు -1 మినహా మిగిలిన ర్యాంప్‌లలో గోదావరిని డ్రెడ్జర్లతో దొలిచేస్తున్నారు. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడేస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారానికి తెగబడుతున్నారు. కంచే చేను మేస్తే అన్న చందాన అధికార పార్టీ నాయకులే ఇసుక వ్యాపారంలో పాత్రదారులు..సూత్రదారులు కావడంతో అధికారులు ఏం చేయలేకపోతున్నారు. అయితే శనివారం కలెక్టర్ మాధవీలత ఇసుక అక్రమాలపై నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు.ఈ టీమ్ ఎంత వరకూ అక్రమాలను నియంత్రిస్తుందో వేచి చూడాల్సిందే..

నిబంధనలు తుంగలో తొక్కి..

ప్రభుత్వ పెద్దలతో నేరుగా సంబంధాలు ఉన్న నాయకులే ఈ అక్రమ వ్యాపారం చేయడం పరిపాటిగా మారింది. అక్రమంగా వచ్చిన కోట్లాది రూపాయల నగదు పెద్ద ఎత్తున చేతులు మారుతోంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అథారిటీ (ఎన్‌జీటీ) నిబంధలనకు విరుద్ధంగా ఇసుక ర్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. గోదావరిలో ఇసుకతీత కేవలం కార్మికులే చేయాలి. నావలో నది మధ్యకు వెళ్లి ఇసుకను తోడి ఒడ్డుకు తెచ్చి రేవులో గుట్టగా వేయాలి. దానిని కార్మికులు లారీలలో లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ వల్ల వందలాది మందికి పని దొరుకుతుంది.పర్యావరణ పరిరక్షణ జరుగుతుంది. కానీ ఒక్క ర్యాంపులో కూడా ఆ నిబంధనలు పాటించడంలేదు. ఎన్‌టీజీ నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జర్లతో గోదావరిలో ఇసుకను తోడేళ్ళ మాదిరిగా తోడేస్తున్నారు. దీని వల్ల నదీ గర్భంలో పెద్దపెద్ద అగాధాలు ఏర్పడుతున్నాయి. కాతేరు,గాయత్రి, కోటీలింగాలు రేవులలో రాత్రి 7 గంటల నుంచి డ్రెడ్జింగ్ ఆరంభిస్తున్నారు.రాత్రంతా ఇసుక తోడేస్తున్నారు. 10 యూనిట్లు, 16 యూనిట్లు, 20 యూనిట్లు, భారీ డ్రెడ్జింగ్ పడవలు ఉపయోగిస్తున్నారు.పైప్ డ్రెడ్జర్లు నదిలో పెట్టుకుని చిన్న చిన్న పడవలతో వచ్చి ఇసుక తోడేస్తున్నారు.ఒక పక్క వంతెనలకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వ కూడదని నిబంధన ఉన్నా లెక్క చేయడంలేదు. అంతా మా ఇష్టం అంటున్నారు. నిఘా శాఖలు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో ఇష్టారాజ్యంగా అక్రమ వ్యాపారం సాగుతుంది. సాధారణంగా ప్రతిరోజు ఎస్ఈబీ తనిఖీలు ఉండేవి..అవీ లేవు. వారు మొత్తానికే పట్టించుకోవడంలేదు. ర్యాంప్‌ల నిర్వాహకులను అడ్డుకునే పరిస్థితులు లేవు. రోడ్లపై లారీల బిల్లులను తనిఖీలు చేసేవారు ఇప్పుడు అటువంటివేమికానరావడంలేదు. ఇసుక లారీపై క్లాత్ కట్టకపోయినా ఫైన్ వేసేవారు లేరు. పూర్తిగా అధికారులంతా ఇసుక ర్యాంప్‌లు నిర్వహించే సంస్థలకు సరెండర్ కావడం విస్మయానికి గురిచేస్తుంది .

- యథేచ్ఛగా సా..గుతున్న దోపిడీ
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- నిబంధనలకు నీళ్లొదిలేశారు..
- మామూళ్ల మత్తులో అధికారులు
- ర్యాంపుల వైపు కన్నెత్తి చూడని వైనం
- సొసైటీలకు మిగిలిందేంలేదు
- ఆర్‌కేదే అధికారమంతా?

దోపిడీ సాగుతుందిలా..

గతంలో జేపీ సంస్థ ఆదీనంలో ఇసుక వ్యాపారం చేసే వా రు. అటుపై ర్యాంపులన్నీ ఆర్‌కే ఆదీనంలోకి వచ్చాయి. ప్రభు త్వ పెద్దల బ్యాగ్ బోసుగా ఆర్‌కే పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నారు. సాధారణ ఇసుక నావలో తీసుకు వస్తే యూనిట్ (4.5 టన్నులు) రూ.450 నుంచి రూ.500 వరకు బోటు యజమానికి ధరలు సొసైటీ చెల్లించేది. కానీ డ్రెడ్జింగ్ ఆరం భించాక సొసైటీకి యూనిట్ ఇసుక రూ.200లకే సరఫరా చేస్తున్నారు. ఇది అక్రమం అయినా లక్షల యూనిట్ల ఇసుక తోడేస్తున్నారు. ఇలా డ్రెడ్జర్‌తో తీసిన ఇసుకకు సొసైటీ నిర్వాహకులకు టన్నుకు ఆర్‌కే రూ.125 ఇస్తున్నారు. దానిని టన్ను రూ.525లకు విక్రయిస్తున్నారు.దీని వల్ల సొసైటీకి టన్నుకు రూ.125 చొప్పున లారీకి రూ.1250 ఇస్తున్నారు.అయితే ఆర్‌కే పది టన్నుల లారీ రూ.5250లకు విక్రయిస్తున్నాడు.ఒక్క పది టన్నుల లారీపై అతనికి రూ.4 వేలు మిగు లుతుంది.ఇలా ప్రతి రోజు వేలాది లారీలు ఇసుకను రవాణా చేస్తున్నాయి. అయితే ఇంతా కష్టపడిన సొసైటీలకు మాత్రం వచ్చే రూ.1250లో లోడింగ్‌కు రూ.200, రెండున్నర యూనిట్ల ఇసు కకు రూ.500 ఖర్చు కలిపి మొత్తం రూ.700 ఖర్చులై మిగిలిన రూ.550 వస్తుంది. కష్టపడిన వారికి రెండున్నర యూనిట్ల లారీకి రూ.550 మాత్రమే వస్తుండగా గట్టున కూర్చున్న వారు రూ.4 వేలు అక్రమ ఆదాయం సంపా దిస్తున్నారు. ఒకే బిల్లుపై రెండు మూడు ట్రిప్‌లు వేసే వారికి ఆదాయం పుష్కలంగా వస్తుంది. ఒక లారీకి ఇసుక రూ.5,250 పెట్టి ఇసుక కొనుగోలు చేసిన ట్రాన్స్‌పోర్టర్ దానిపై లోకల్ అయితే రూ.7 వేలు, నాన్‌లోకల్ అయితే రూ.10 వేలు, దూర ప్రాంతాలైతే మూడు యూనిట్ల లారీ రూ.15వేలకు వినియోగదారులకు చేరుతుంది. 18 టన్నుల లారీలు అయితే రూ.25 వేల పైమాటే ఉంది. అక్రమార్జన అంతా పెద్దల జేబుల్లోకి వెళ్లిపోతోంది. డ్రెడ్జర్లు ,మిషనరీల ప్రభావంతో కూలీలకు ,ఇసుకతీత పనులు చేసుకునేవారికి పనులు లేక ఇబ్బందులు పడుతు న్నారు. కష్టపడి పనిచేసిన సొసైటీలకు ట్రాన్స్‌పోర్టర్లకు కూలీ డబ్బులు వస్తున్నాయి.ఇసుక ర్యాంప్‌లు నిర్వహిస్తున్నవారికి మాత్రం కోట్లు కురుస్తున్నాయి. దీనిని ప్రశ్నించే వారే లేరు. నెలల ఖర్చుల కోసం సొసైటీలు, ఈఎంఐల కోసం లారీ ట్రాన్స్‌పోర్టర్లు రాజీ పడి చేస్తున్నారు.నిర్వాహకులు మాత్రం అందినకాడికి దోచుకుంటున్నారు.



శెట్టిబలిజ గౌడల ఆత్మీయ సమ్మేళనంలో సమైక్య అభివాదం చేస్తున్న నాయకులు మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, ఆదిరెడ్డి వాసు తదితరులు

కులాలను విభజించి వైసీపీ నాటకాలు

- టీడీపీలోనే శెట్టిబలిజ గౌడలకు ప్రాధాన్యం
- ఆత్మీయ సమ్మేళనంలో రెడ్డి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18 : కులాలను విభజించి వైసీపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు.రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి ఫంక్షన్ హాలులో ఆదివారం టీడీపీ శెట్టి బలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు నేతృత్వంలో జరిగిన శెట్టిబలిజ గౌడ ఆత్మీయ సమావేశంలో తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం తారకరత్న వర్ధంతిని పురస్కరించుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. శెట్టిబలిజ గౌడలకు ఏనాడో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ముందుకు తీసుకువచ్చింది టీడీపీ అన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఆదిరెడ్డి వాసు ఈ రోజు శెట్టిబలిజ, గౌడలను దత్తత తీసుకుంటున్నారన్నారు. శెట్టిబలిజ గౌడలు ఆత్మవిమర్శ చేసుకుని ఆదిరెడ్డి వాసును గెలిపించుకోవాలన్నారు. 1947లో స్వాతంత్రం దేశానికి వస్తే ఎన్‌టీఆర్ టీడీపీ పెట్టాకే వెనుకబడిన కులాలకు స్వాతంత్రం వచ్చిందన్నారు. వెనుకబడిన కులాలకు స్థానిక సంస్థల్లో ఎన్‌టీఆర్ 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారని చెప్పారు. కానీ ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించి రాష్ట్రంలో 16800 పోస్టులు పోవడానికి కారకుడయ్యారని విమర్శించారు. అటువంటి జగన్‌కు బుద్ధిచెప్పాలన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత శెట్టిబలిజ, గౌడలపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ టీడీపీని అన్న ఎన్‌టీఆర్ పెట్టింది బీసీల కోసమేనన్నారు. సీఎం జగన్ శెట్టిబలిజ గౌడలకు అన్యాయం చేశాడన్నారు. ఎంపీ భరత్ రామ్ సినిమా అయిపోయిందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ టీడీపీకి బ్యాక్ బోన్ బీసీలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు పదవులు కొత్తకాదన్నారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మన మధ్య వైసీపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక అమరనాథ్‌గౌడ్ తన అక్క కోసం వైసీపీ వారిని ఎదురిస్తే ఆ బాలుడుపై పెట్రోల్ పోసి చంపేశారని, అప్పుడు ఆ పార్టీ బీసీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రిజర్వేషన్లు 10 శాతం తగ్గించినప్పుడు ఏమి చేశారని ప్రశ్నించారు. శెట్టిబలిజ గౌడల ఆత్మగౌరవం ఎక్కడా తగ్గకుండా తాను చూసుకుంటానని చెప్పారు.జనసేన నగర అధ్యక్షుడు అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలను జగన్ నమ్మించి మోసం చేశాడన్నారు. 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి ఇప్పుడు నాటకాలు ఆడితే నమ్మేవారు లేరన్నారు. శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ శెట్టిబలిజగౌడలు టీడీపీకే ఎందుకు ఓటు వేయాలో చెప్పారు. ఆదిరెడ్డి వాసును ఎమ్మెల్యే, చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా శెట్టిబలిజ గౌడలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. వైజంక్షన్‌లో సర్దార్ గౌతు లచ్చన విగ్రహానికి ఆదిరెడ్డి వాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గీత కార్మికులు మోకులతో భారీ ర్యాలీ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వైశ్రీను, జోన్ -2 నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు,నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, బీసీ సెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు పవన్ కల్యాణ్ రాక

నాలుగు నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమీక్ష



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. విశాఖ నుంచి చాపర్‌లో మధ్యాహ్నం సుమారు ఒంటి గంటకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి కారులో రాజమ హేంద్రవరంలో ఉన్న జనసేన కార్యాలయానికి చేరుకుంటారు.సుమారు 2 గంటల పాటు ఇక్కడ ఉంటారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి ఇన్‌చార్జిలు, ముఖ్యమైన నేతలతో సమావేశం అవుతారు. జిల్లాలో జనసేన ఎక్కడి నుంచి పోటీ చేస్తుందో, అక్కడ జనసేన, టీడీపీ కేడర్‌తో ఎలా కలిసి పనిచేయాలో వంటి అంశాలపై దిశానిర్ధేశం చేయనున్నారు.జిల్లాలో కనీసం రెండు స్థానాల్లో జనసేన పోటీ చేసే అవకాశం ఉన్నట్టు ఇప్పటికే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ ఇప్పటికే రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో పాటు రాజమ హేంద్రవరం రూరల్ సీటు గురించి ఇక్కడ ప్రస్తావన వచ్చే అవకాశం ఉంది.ఈ సీటు నుంచి సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పోటీ చేస్తానని చెబుతుండగా, జనసేన నేత, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ కూడా ఇక్కడ నుంచే పోటీ చేస్తానని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ ఇక్కడ సోమవారం నిర్వహించే సమావేశంలో ఈ ప్రస్తావన వచ్చే అవకాశం ఉంది. ఇక జిల్లాలో నిడదవోలు నియోజకవర్గం విషయంలో కూడా రకరకాల ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు ఇక కొద్దిరోజుల్లోనే రానున్నాయి.ఇంకా టికెట్లు ఖరారు కాలేదు. ఇవన్నీ ఇక్కడ ప్రస్తావనకు వచ్చే అవకాశం లేకపోలేదు.జనసేన అధినేత రానుండడంతో జిల్లాలోని జనసేన కేడర్‌తోపాటు టీడీపీలో కూడా ఉత్సాహం కనిపిస్తోంది.

పాత పింఛను ఇచ్చే వారికే ఓటు : యూటీఎఫ్

కొవ్వూరు, ఫిబ్రవరి 18 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, పాత పింఛను విధానాన్ని అమలుపర్చాలని నిర్ణయం తీసుకున్న రాజకీయ పార్టీకి ఎన్నికల్లో మద్దతు పలకనున్నట్టు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్ తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.జవహర్‌ను యూటీఎఫ్ నాయకులు కొవ్వూరులో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు. జయకర్ మాట్లాడుతూ సీపీఎస్ వల్ల ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.చాలా రాష్ట్రాలు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాయన్నారు. ఏపీలోను పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేసి గ్రాట్యుటీ, పింఛను సౌకర్యాలను కల్పించాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే పాత పింఛను విధానంపై స్పష్టమైన హామీ ప్రకటించి, మేనిఫెస్టోలో పెడుతుందో వారికే ఉద్యోగ, ఉపాధ్యాయులంతా మద్దతు తెలపాలని నిర్ణయించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు షరీఫ్, రూపస్, రమేష్, రవిబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీ కార్యాలయం తరలింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఆవరణలోని జోన్-2 ప్రాంతీయ వైద్య, ఆరోగ్యశాఖ సంచాలకుల వారి కార్యాలయాన్ని మల్లికార్జున నగర్‌లోని వైఎంసీఏ బిల్డింగ్‌లోకి తరలించారు. మల్లికార్జుననగర్‌లో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ రోడ్డులో సీటీఆర్ఐ ఆటోస్టాండుకు వెళ్లే దారిలో ఈ వైఎంసీఏ భవనం ఉంది. ఆర్‌డీ కార్యాలయం ఇప్పటి వరకూ జీజీహెచ్ ప్రాంగణంలోని ఒక భవనంలో కొనసాగింది. అయితే ఆర్‌డీ కార్యాలయ భవనాన్ని మెడికల్‌కాలేజీ అవసరాల నిమిత్తం ఏపీఎస్ఎంఐడీసీ అధికారులు తమ స్వాధీనంలోకి తీసుకోవడంతో ఆర్‌డీ కార్యాలయం తరలింపు అనివార్యంగా మారింది. ఈనెల 19వ తేదీ సోమవారం నుంచి కొత్త భవనంలో ఆర్‌డీ కార్యాలయం సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వైద్య ఉద్యోగులు దీన్ని గమనించాలని ఆర్‌డీ కార్యాలయం సూపరింటెండెంట్ సురేష్‌బాబు కోరారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి: హోం మంత్రి



దేవరపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న మంత్రి వనిత

దేవరపల్లి, ఫిబ్రవరి 18: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లిలో ఆదివారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శ్రీకారం చుట్టారు. దేవరపల్లిలో బస్టాండ్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను, వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోను, ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డులు, బీసీ కమ్యూనిటీహాలు, ప్రహరీగోడను, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. దేవరపల్లి, బందపురం, దూమంతన గూడెంలో గ్రామ సచివాలయ భవనాలు, హెల్త్‌కేర్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జడ్పీటీసీ స్వర్ణలత, వైసీపీ కన్వీనర్ కూచిపూడి సతీష్, సర్పంచ్ కడిమి వీరకుమారి, కార్యదర్శి రవికిషోర్, ఎంపీటీసీలు కామిశెట్టి శిరోమణి, రామలక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనం



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సామూహిక ఉపనయన దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 18: శ్రీగాయిత్రీ లక్ష్మీగణపతి పురోహిత సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఆదివారం సామూహిక ఉపనయన కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రంలోని సుందర గోవిందుని ఆలయ ప్రాంగణంలో సంఘం అధ్యక్షుడు వారణాసి హనుమంతశర్మ ఆధ్వర్యంలో 20మంది బ్రాహ్మణ వటువులకు ఉపనయనం నిర్వహించారు. కార్యక్రమంలో పారుపూడి సూర్యరామసుబ్రహ్మణ్యం, బొందలపాటి సుబ్రహ్మణ్యశర్మ, కృష్ణంపల్లి అనీల్, విస్సాప్రగడ ప్రసాద్, యనమండ్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇంగ్లీషు వర్కుషాపు

కొవ్వూరు, ఫిబ్రవరి 18: ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వర్కుషాప్‌లు, సెమినార్‌లు దోహదపడతాయని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చునని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకటసుబ్బారావు అన్నారు. కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంగ్లీషు వర్కుషాపు ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస చక్రవర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులు, అధ్యాపకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లీషు బాషా నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ.రాణి, డి.రామలింగేశ్వరరావు, విజయకుమార్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో టీడీపీ- జనసేన ఇంటింటా ప్రచారం



నిడదవోలులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, ఫిబ్రవరి 18: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ- జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుతూ నిడదవోలులోని రాయిపేటలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం సింగవరం-తాళ్లపాలెం వద్ద రైల్వే అండర్ పాస్ వంతెన వద్దకు వెళ్లి గడ్డర్‌ను తొలగించకపోతే జనసేన దీక్ష చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, టీడీపీ- జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పాల వీరాస్వామి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



చాగల్లు, ఫిబ్రవరి 18: మండలంలోని చిక్కాలపాలెంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా శనివారం, ఆదివారం వివిధ పూజలు నిర్వహించగా, సోమవారం ప్రత్యేక పూజలు, ప్రాణప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం, భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే దారవరంలో కోదండరామాలయ నిర్మాణం, విగ్రహ పునఃప్రతిష్ఠ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, గోపూజ, మండప పునఃపూజ, మూర్తి హోమం, బలివితరణ నిర్వహించారు. సోమవారం విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణం అనంతరం అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 18: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని ఏషియన్ పేయింట్స్ గొడౌన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తిని ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. శరీరం నుజ్జునుజ్జయ్యి గుర్తు పట్టలేనంతగా మారింది. సీఐ జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని హైవే పెట్రోలింగ్ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వార్డు రెవెన్యూ సెక్రటరీ కె.మౌనిక ఫిర్యాదుమేరకు ఎస్ఐ మహ్మద్ జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

స్కూటీ నుంచి జారిపడి లెక్చరర్ మృతి



ప్రసన్నకుమార్(ఫైల్)

నిడదవోలు, ఫిబ్రవరి 18: స్కూటీ నుంచి జారిపడి ఓ లెక్చరర్ మృతిచెందారు. నిడదవోలులోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా విధులు నిర్వ హిస్తున్న మెరకనల్లి ప్రసన్నకుమార్(55) ఆదివారం నిడదవోలు నుంచి వేలివెన్ను వెళుతూ అట్లపాడు వద్ద స్కూటీ అదుపు తప్పి జారిపడి రోడ్డుపై పడ్డంతో ముఖానికి తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రసన్నకుమార్ కొద్దిరోజులుగా వేలివెన్ను శశి కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక స్పందన

రాజమహేంద్రవరం రూరల్ , ఫిబ్రవరి 18: ప్రతినెల మూడో సోమవారం కలెక్టర్ డాక్టర్ మాధవీలత, ఎస్పీ పి.జగదీశ్‌లు కలిసి కలెక్టరేట్‌లోనే ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. జిల్లాపరిధిలో డివిజన్, మండల, గ్రామ సచివాలయ స్థాయిల్లో స్పందన యధావిధిగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

సూర్యనారాయణుడికి పూజలు

కొవ్వూరు, ఫిబ్రవరి 18: మాఘమాసం ఆదివారం సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామి ఆలయం, సంస్కృత పాఠశాలలోని గోష్పదేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణమూర్తికి అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించి, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు, సూర్యనమస్కారాలు అందజేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దగా పడ్డ దళితులు

» నిడదవోలులో దళితుడా రా.. కదలి రా..సభలో రాజేష్

» వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించాలని పిలుపు



కార్యక్రమానికి హాజరైన దళితులు

నిడదవోలు, ఫిబ్రవరి 18: ఎంతో పౌరుషం ఉన్న దళితులు వైసీపీ ప్రభుత్వంలో దగా పడ్డారని, జగన్‌రెడ్డి దళితులను నమ్మించి మోసం చేశాడని, మోసపోయిన దళితులు 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మహాసేన రాజేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో దగా పడిన దళితుడా రా.. కదలి రా.. కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనవాళ్లెవరో పగవాళ్లెవరో తెలుసుకుందామని దళితులకు గౌరవం ఇస్తున్న చంద్రబాబు, లోకేశ్‌లకు అండగా ఉండి 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. వైసీపీ పాలనలో దళితులు హత్యకు గురవుతున్నారని, అయితే టీడీపీ పాలనలో రాజకీయంగా ఎదిగేందుకు ఎంతో భవిష్యత్తు ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు దళితులు ఆరాటపడక్కరలేదని, అందరికీ ఇస్తున్న పథకాలే ఇస్తున్నారని, ఎస్సీఎస్టీలకు ప్రత్యేకంగా ఇచ్చేవి ఏమీ లేవన్నారు. అన్ని రంగాల్లో ఉన్న దళితులు అభివృద్ధి చెందాలని, అది టీడీపీ ప్రభుత్వం హయాంలోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి బాధ్యత అని రాజేష్ అన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నిడదవోలులో సభలో ప్రసంగిస్తున్న మహాసేన రాజేష్

కొవ్వూరులో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు

» డీఎస్పీ రామారావు..సబ్‌జైలు ప్రాంగణం పరిశీలన



పోలీసుస్టేషన్ నిర్మాణానికి సబ్‌జైలు వద్ద స్థలం పరిశీలిస్తున్న డీఎస్పీ

కొవ్వూరు, ఫిబ్రవరి 18: కొవ్వూరు సబ్‌జైలు ప్రాంగణంలో పట్టణ పోలీసుస్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. ఆదివారం సబ్‌జైలు ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొవ్వూరులో మోడల్ పోలీసుస్టేషన్ మంజూరైందని, దాని నిమిత్తం స్థానిక గోదావరి ఏటిగట్టు రోడ్‌పై పాత రైలు వంతెన వద్ద మున్సిపల్ తాత్కాలిక డంపింగ్ యార్డు స్థలంలో 35 సెంట్లు మోడల్ పోలీసుస్టేషన్‌కు కేటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ స్థలానికి సబ్‌జైలు నిర్మాణానికి అందించి, ప్రస్తుతం కొవ్వూరు సబ్‌జైలు ఉన్న 28 సెంట్లు భూమిలో మోడల్ పోలీసుస్టేషన్ నిర్మిస్తామన్నారు. దానిలో భాగంగా ఆదివారం సబ్‌జైలు ప్రాంగణాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సీఐ వి.జగదీశ్వరరావు, సిబ్బంది శ్రీనివాస్, సీహెచ్ బాబూరావు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలి

» చారిత్రక నేపథ్యం పాడవకూడదు

» ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 18: సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా ఉన్న భారతదేశంలో పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలని ఈ సందర్భంలో ఆలయాలకు చారిత్రక నేపథ్యం పాడవకూడదని పరమహంస పరివ్రాజక ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. కోరుకొండలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన ఆయన కొద్దిసేపు అనుగ్రహ భాషణం చేశారు. ఆదివారం ఆయన మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మిలతో కలిసి కోరుకొండలో రూ.3.80కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో శంకుస్థాపన చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తదుపరి నరసన్న కొండ మెట్ల మార్గం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కొండ కొద్ది దూరం ఎక్కి అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. తదుపరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన సభలో అనుగ్రహ భాషణం చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం ద్వారా కొన్ని వేల సంవత్సరాల చరిత్రకు ప్రాణం పోసినట్టుయిందన్నారు. ఆనాడు శ్రీలంకకు రాముడు వేసిన సేతువు పదిహేడున్నర లక్షల సంవత్సరాలుగా నాసా ప్రకటించిందన్నారు. ఇది సహజంగా ఏర్పడింది కాదని మానవ నిర్మితమని తేల్చిచెప్పారని చినజీయర్ స్వామి గుర్తుచేశారు. ప్రపంచంలో ఏ మూల అప్పటికి ఏ నాగరికత కళ్లు తెరవలేదన్నారు. అందువల్లే కొత్త కాలయాలు నిర్మించడం కన్నా పాత ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ రామచంద్రమోహన్, అన్నవరం, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలు వేద పండితులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ రామచంద్రమోహన్, వేద పండితులు, లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పరాసరరంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రఘునాథ భట్టర్, ఆలయ అర్చకస్వాములు, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరావు, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, తాడి రజని, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, వాకా నరసింహారావు, నక్కా రాంబాబు, కటకం చటం పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

ముళ్లపూడి బాపిరాజు పుట్టినరోజు వేడుకలు



నల్లజర్ల ఆనంద నిలయంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నల్లజర్ల, ఫిబ్రవరి 18: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు పుట్టినరోజును మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నల్లజర్ల ఆనంద నిలయంలో విద్యార్థుల సమక్షంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంచారు. అలాగే పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంచారు. కార్యక్రమంలో చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, వల్లూరి సత్తిపండు, గుదె సుబ్బారావు, సవలం రామకృష్ణ, కొయ్యలమూడి నాగార్జున, నాదెళ్ల శ్రీరామ్, చింతా చైతన్య పాల్గొన్నారు.

కొత్త పైపు లైను వేసి తాగునీరు అందిస్తాం

జనసేన సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ



నల్లజర్ల, ఫిబ్రవరి 18: మండలంలోని ఆవపాడు కొత్తపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడై తాగునీటి సమస్య నెలకొనడంతో జనసేన సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ కొత్తపేటకు నూతనంగా పైపు లైను వేసేందుకు ఆదివారం పనులు ప్రారంభించారు. పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ రావాడానికి నూతనంగా విద్యుత్ లైన్లు వేయవలసి ఉంది. వారం పది రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నందును ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా నూతనంగా పైపు లైను వేసి యుద్ధ ప్రతిపాదికన తాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. మరో ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి కొత్తపేట పైపులైనుకు అనుసంధానం చేస్తున్నామన్నారు. విద్యుత్ అధికారులు త్రీఫేజ్ లైన్లు వేసి ట్రాన్స్ ఫార్మర్ బిగించాలని డిమాండ్ చేశారు.

వంగవీటి మోహనరంగ విగ్రహావిష్కరణ



రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధ

దేవరపల్లి, ఫిబ్రవరి 18: దివంగత నేత వంగవీటి మోహనరంగ బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని డీసీసీబీ మాజీ చైర్మన్ కారటం రాంబాబు అన్నారు. మండలంలోని యర్నగూడెంలో కాపు సంఘం నాయకులు ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగ విగ్రహాన్ని వంగవీటి రాధ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, జనసేన ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు, ఫిబ్రవరి 18: మండలం తిమ్మరా జుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహా రతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనా మ కుంకుమ పూజలు చేశారు. అనంతరం క్షీర నివేదన, మహానివేదన చేపట్టారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శిం చుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేశారు. అమ్మ వారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.1,14,914 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం మండలం నుదురుబాదు గ్రామానికి చెందిన బండారు వెంకట రామశంకర్(22) తన స్నేహితులు 9 మందితో కలిసి విజయవాడ నుంచి మారేడుమిల్లి మోటారుసైకిళ్లపై బయలుదేరారు. ఎన్‌హెచ్-16 జాతీయ రహదారిపై కొవ్వూరు మండలం కాపవరం సమీపంలో ఎదురుగా జంతువు రావడంతో సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన రామశంకర్‌కు తలకు గాయం కాగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామశంకర్ ఆదివారం మృతిచెందారు. ఆసుపత్రి సమాచారం మేరకు మృతుడి స్నేహితుడు విశ్వనాధపల్లి జశ్వంత్‌రాజ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 18: కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పసలపూడి సుబ్బారావును ఆదివారం అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అతడి నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం



కొవ్వూరు, ఫిబ్రవరి 18: గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరులోని ఔరంగాబాద్ ఇసుకర్యాంపు సమీపంలో గోదావరి నదిలో మృతదేహం తేలుతుందని స్థానికుల సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి, ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, చేతిపై డాడి, మోహన్ అని పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడు జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలకు చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

నువ్వులేక.. నేను లేను!

భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య మృతి



గోకవరం, ఫిబ్రవరి 18 : భర్త మరణాన్ని తట్టుకోలేక గంటన్నర వ్యవధిలోనే భార్య కూడా మృతి చెందిన విషాద ఘటన ఇది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామానికి చెందిన కోసూరి సత్యనారాయణ(77) అనారోగ్యంతో శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి వద్ద మృతిచెందాడు. అప్పటి వరకూ తమతో ఉన్న తన భర్త ఇకలేడని తెలిసి మృతదేహాన్ని పట్టుకుని భార్య వరలక్ష్మి(65) వెక్కి వెక్కి ఏడ్చింది..అలా ఏడుస్తూనే 11.30 గంటల సమయంలో భర్త మృతదేహాన్ని పట్టుకుని అలా ఉండి పోయింది. బంధువులు తట్టిలేపినా లేవలేదు. దీంతో కంగారుపడిన కుటుంబీకులు వైద్యుడిని పిలిపించి చూపించగా అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. బంధువులు ఇద్దరిని విగతజీవులుగా చూసి కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలు ముకున్నాయి. దంపతులకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. నిన్నటి వరకూ తమ మధ్య తిరిగిన దంపతులు ఒకేరోజు మృతి చెందడం చాలా బాధాకరమని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. మృతులకు కుమార్తె కుమారుడు ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక స్పందన

రాజమహేంద్రవరం రూరల్ , ఫిబ్రవరి 18: ప్రతినెల మూడో సోమవారం కలెక్టర్ డాక్టర్ మాధవీలత, ఎస్పీ పి.జగదీశ్‌లు కలిసి కలెక్టరేట్‌లోనే ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. జిల్లాపరిధిలో డివిజన్, మండల, గ్రామ సచివాలయ స్థాయిల్లో స్పందన యధావిధిగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

యువ వైద్యుల్లో సేవాగుణం ఉండాలి

సినీ నటుడు, మోటివేషనల్ స్పీకర్ ప్రసాద్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, మోటివేషనల్ స్పీకర్ ప్రసాద్



రాజానగరం, ఫిబ్రవరి 18: యువ వైద్యులు ధనార్జనే ధ్యేయం కాకుండా తమ వద్దకు వచ్చే రోగుల పట్ల దయతో పాటు సేవాగుణం కలిగి ఉండాలని సినీ నటుడు, సాఫ్ట్‌స్కిల్ ట్రెయినర్, మోటివేషనల్ స్పీకర్ కేవీ ప్రసాద్ ఆకాంక్షించారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 2023-24 బ్యాచ్ ఫ్రెషర్స్ డే ఉద్భవ్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి మనిషి పుట్టుకతో గొప్పవారు కాలేరని, లక్ష్య సాధనతో ఉన్నత శిఖరాలను చేరుకోగలరన్నారు. అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి ఎనలేని సంతృప్తి పొందవచ్చన్నారు. అనంతరం వైద్య విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్యా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డీన్ డాక్టర్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎం మిశ్రా, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమైన ఓటును అమ్ముకోకండి

సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరబాబు



పాదయాత్ర చేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు వీరబాబు

సీతానగరం, ఫిబ్రవరి 18: పవిత్ర మైన ఓటు హక్కును సొమ్ములకు అమ్ముకోవద్దని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పలివెల వీరబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన చినకొండేపూడిలోని పార్టీ కార్యాలయం నుంచి గణేశ్వరరావు హాస్పిటల్ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఇప్పటి వరకు నాలుగు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించినట్టు చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ కిల్లారి శ్రీదేవి, గోపాలపురం నందమూరి చిట్టి సాంబ, కొవ్వూరు సిద్దే నాగరాజు, పెద్దాపురం పలివెల లోకేష్‌లను అభ్యర్థులుగా ప్రకటించినట్టు చెప్పారు. మరో మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు. కాగా ప్రజలు ఓటు హక్కును అమ్ముకుని రాష్ట్రాన్ని, మన బతుకులను నాశనం చేసుకోవద్దని, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రాంత ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని, సరైన నాయకుడిని ఎన్నికోవాలని వీరబాబు సూచించారు.

కోరుకొండలో అగ్నిమాపక కేంద్రం

ప్రారంభించిన హోం మంత్రి తానేటి వనిత

కోరుకొండ, ఫిబ్రవరి 18: ఎన్నో సంవత్సరాలుగా రాజానగరం నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛగా మిగిలిపోయిన కోరుకొండలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు సాకారమైందని మంత్రులు తానేటి వనత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం సాయంత్రం కోరుకొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన అగ్నిమాపక కేంద్రాన్ని ఎమ్మెల్యే రాజాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సదస్సులో మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలో అవసరమైన చోట అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లోని 17 మేజర్ పంచాయతీలకు అగ్నిమాపక కేంద్రం ద్వారా సర్వీసులు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వల్లి సూర్యకుమారి, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, కొయిడాల నానాజీ, జాజుల రాము, ఎంపీటీసీ కాలచర్ల నాగేశ్వరరావు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1 : ఈగల్
వై.స్క్రీన్2 : రాజధాని ఫైల్స్
దేవిశ్రీ(గాయత్రి) : హనుమాన్
అనన్య : అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్

నిడదవోలు

వీ మ్యాక్స్ : ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ : రాజధాని ఫైల్స్
శ్రీగణపతి : ఈగల్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్ : గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ : సలార్
శ్రీనివాస : సలార్